సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 8 । జూలై । 2025



రాజన్న సేవలో..

వేములవాడ: రాజన్నను సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ సతీమణి అపర్ణ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు.



అడవంతా పండుగ..

గిరిజనుల ఆరాధ్య దైవం శీత్లాభవాని అమ్మవారి వేడుకలకు తండాలు ముస్తాబయ్యాయి. అడవి బిడ్డల ప్రత్యేక పండుగగా శీత్లా భవానిని వేడుకుంటారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/25.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జిగా అద్దంకి దయాకర్



కరీంనగర్ కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ నియమితులయ్యారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు పార్టీని సంస్థాగతంగా పునర్నిర్మాణం చేయడంలో భాగంగా ఉమ్మడి జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జిలను నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాకు చెందిన బీసీ సంక్షమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మెదక్ ఉమ్మడి జిల్లాకు, రాష్ట్రసంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను వరంగల్ ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా నియమించారు.

జిల్లాకు వర్షసూచన

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈనెల 9వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం తెలిపారు. వాతావరణ శాఖ సూచనల మేరకు బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని, దీంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న నరేందర్

రామగిరి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీల్లో ఎప్పటికప్పుడు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జెడ్పీ సీఈవో నరేందర్ ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో శైలజారాణి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, తదితర అంశాల గురించి వివరించారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని జెడ్పీసీఈవో పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గపోరుకు 'గుజ్జుల' తీరే కారణం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గానికి పాతికేళ్ల కాలం క్రితం వలస వచ్చిన గుజ్జుల రామకృష్ణారెడ్డిని కేవలం 12 రోజుల స్వల్ప కాలంలోనే పెద్దపల్లి ప్రజలు అక్కున చేర్చుకొని ఎమ్మెల్యేగిరి అప్పగిస్తే.. రూ.వందల కోట్ల ఆస్తులు కూడబెట్టుకొని పార్టీని ఇతర పార్టీలకు తాకట్టు పెట్టి లబ్ధి పొందుతున్నాడని బీజేపీ నాయకులు చిలారపు పర్వతాలు, కావేటి రాజగోపాల్, ఈర్ల శంకర్, సంపత్‌రావు ఆరోపించారు. పెద్దపల్లిలో సోమవారం మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేశ్, మండల అధ్యక్షుడు వేల్పుల రమేశ్ పార్టీ అధిష్టానం అనుమతితో కమిటీలను ప్రకటిస్తే.. జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి తమ వారితో అర్ధరహిత, నిరాధార ఆరోపణలు చేసి కార్యకర్తలు, నాయకుల్లో అయోమయం సృష్టించేందుకు యత్నించడమేమిటని మండిపడ్డారు. ఇపుడు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కర్రె సంజీవరెడ్డికి కనీసం సభ్యత్వం కూడా లేదన్నారు. నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, మేకల శ్రీనివాస్, చిలువేరు సంపత్, కారంగుల శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న రేవతిరావు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పిల్లలను సర్కారు బడులకే పంపించాలని మహిళా కమిషన్ సభ్యురాలు కటారి రేవతిరావు అన్నారు. కొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించి వసతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ, తెనుగువాడ నుంచి విద్యార్థులు పాఠశాలకు రావడం ఇబ్బందిగా మారిందని పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ సబ్బు రాజకుమారి తదితరులు రేవతిరావు దృష్టికి తెచ్చారు. రైల్వే గేటు మూసివేతతో కష్టాలు పెరిగాయని, అండర్ బ్రిడ్జి ద్వారా వచ్చేందుకు దూరం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

అమ్మే.. ఆది గురువు!



లే కన్నా..: బిడ్డను నిద్ర లేపుతున్న తల్లి



శుభ్రంగా ఉండాలి: స్నానం పోస్తూ..



ఆగమ్మా..: బిడ్డ షర్టుకు గుండి పెడుతూ..

నాన్నా..లే. స్కూలుకు టైం అవుతోంది. త్వరగా రెడీ కావాలంటూ.. దుప్పట్లోంచి పిల్లల్ని భుజాలపై ఎత్తుకెళ్లి బ్రష్ చేయించి.. స్నానం పోస్తోంది. స్కూల్ యూనిఫాం తొడిగి.. టిఫిన్ తినిపించి లంచ్ బాక్స్, బుక్స్‌ను బ్యాగులో సర్దుతుంది. గేటు బయటివరకూ తీసుకెళ్లి బడికి పంపిస్తుంది. పిల్లలు సాయంత్రం వచ్చేసరికి స్నాక్స్ సిద్ధం చేస్తుంది. వారు ఆడుకుంటుంటే స్నేహితురాలిగా.. హోంవర్క్‌లో టీచర్‌గా మారుతుంది. వారు సతాయిస్తున్నా.. సముదాయిస్తూ హోంవర్క్ పూర్తి చేయిస్తుంది. అలసిపోయిన పిల్లలకు మళ్లీ అన్నం తినిపించి గుండెలపై పడుకోబెట్టుకొని నిద్రపోతుంది. పిల్లలను స్కూలుకు పంపించడం అంత సులువేం కాదు. కాళ్లకు చక్రాలు కట్టుకున్నట్లు చకాచకా వారిని సిద్ధం చేస్తేనే సమయానికి పాఠశాలకు వెళ్తారు. తల్లులకు వేకువజామున మేల్కొనడంతోనే పనులు మొదలవుతాయి. చివరకు బంధువులు, ఇరుగుపొరుగు వారిని ఏయే పరుసలతో పిలవాలో.. పిల్లలకు ముందుగా వచ్చిరాని మాటల నుంచి మొదలుకొని సంస్కారవంతమైన అలవాట్లను నేర్పించడంలో తల్లి పాత్ర కీలకం.

– సాక్షిఫొటోగ్రాఫర్ పెద్దపల్లి



త్వరగా తినూ..: అన్నం తినిపిస్తూ..



తొందరగానే..: బిడ్డకు షూ తొడిగిస్తూ..





బెల్ అవుతుంది కాని..: మధ్యాహ్నం కొడుకుకు లంచ్ తినిపిస్తూ..

చలోచలో..: పిల్లలను పాఠశాలకు తీసుకెళ్తున్న తల్లులు

రేపు సింగరేణిలో టోకెన్ సమ్మె

- సమ్మెతో సంస్థకు నష్టమంటున్న యాజమాన్యం
- కాదు.. హక్కులు సాధ్యమంటున్న కార్మిక సంఘాలు
- గనులపై కార్మిక సంఘాల విస్తృత ప్రచారం
- సమ్మెకు దూరంగా బీఎంఎస్



సింగరేణి కార్మికులు

గోదావరిఖని: సింగరేణిలో సమ్మె సైరన్ మోగనుంది. ప్రభుత్వ రంగ సంస్థలపై కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న ఒక్కరోజు టోకెన్ సమ్మెకు జాతీయ కార్మిక సంఘాల జేఏసీ, విప్లవకార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. సమ్మె విజయవంతం చేయాలంటూ విస్తృత ప్రచారం చేస్తున్నాయి. గేట్ మీటింగ్‌లు నిర్వహిస్తూ సమ్మె ఆవశ్యకతను కార్మికులకు వివరిస్తున్నాయి. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ, జాతీయ సంఘాలు సీఐటీయూ, హెచ్‌ఎంఎస్, గతంలో గుర్తింపు సంఘమైన టీబీజీకేఎస్, విప్లవ కార్మిక సంఘాలు ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ తదితర సంఘాలు ఇందులో పాల్గొంటున్నాయి. బీజేపీకి అనుబంధంగా ఉన్న బీఎంఎస్ మాత్రం సమ్మెకు దూరంగా ఉన్నట్లు ప్రకటించింది. బొగ్గు గనుల్లో 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, లేబర్ కోడ్‌లను కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిద్వారా కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బొగ్గు గనుల్లో వెలికితీత పనులు పర్మినెంట్ కార్మికులతో చేయించాలని, ప్రైవేటు కార్మికుల ప్రమేయం ఉండొద్దని, ఉంటే పర్మినెంట్ కార్మిక వ్యవస్థకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముందుగా జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20నే టోకెన్ సమ్మె చేపట్టాలని నిర్ణయించినా పాకిస్తాన్‌తో యుద్ధం మూలంగా వాయిదా వేశాయి. తిరిగి ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చి.. విజయవంతం చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. కోల్‌బ్లాక్‌ల వేలంలో సత్తుపల్లి ఓసీపీ ప్రైవేట్ సంస్థకు అప్పగించగా ఓసీపీ ఓబీ మట్టిపోయడానికి స్థలం లేదంటోంది. తాడిచర్ల–2, వెంకటాపూర్ గనులు సింగరేణికే అప్పగించి భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలని కోరుతున్నాయి.

సమ్మెతో సింగరేణికి నష్టం..

టోకెన్ సమ్మెతో సింగరేణికి నష్టం వాటిల్లుతుందని, కార్మికులు వేతనాలు నష్టపోతారని యాజమాన్యం అంటోంది. సమ్మెకు కార్మికులు దూరంగా ఉండాలని, సమ్మె డిమాండ్లలో అత్యధికం సంస్థకు సంబంధించినవి కావని, వాటిని తీర్చేటివి కూడా కాదని చెబుతోంది. ఇప్పటికే బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీతలో వెనకబడి ఉన్నామని, జూలై, ఆగస్టులో వర్షాలతో ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగుతుందని పేర్కొంటోంది. ఒక్కరోజు సమ్మె చేస్తే రూ.76కోట్ల బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లుతుందని చెబుతోంది. కార్మికులు వేతనం రూపంలో రూ.13.07కోట్లు నష్టపోతారని, 1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోతుందని అంటోంది.

సమ్మెతోనే కార్మిక హక్కులు సాధ్యం..



సమ్మెతో కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తాం. లేబర్‌కోడ్‌లను రద్దు చేసి గతంలో మాదిరిగా కార్మిక చట్టాలను కొనసాగించాలి. కార్మికులంతా స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి మద్దతివ్వాలి. కేంద్రం తీరుతో సింగరేణి పెద్దమొత్తంలో నష్టపోయింది.

– సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



కార్మిక చట్టాలను గతంలో ఉన్న వాటినే కొనసాగించాలి. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి. అమలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోం. బొగ్గు గనుల ప్రైవేటీకరణ మానుకోవాలి. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉంది.

– తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు

బొగ్గు బ్లాకులు కేటాయించాలి



సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలి. లేబర్ కోడ్‌లు అమలు చేయడం వల్ల కార్మికులకు తీరని నష్టం కలుగుతుంది. బొగ్గుబ్లాక్‌లు ప్రైవేట్‌పరం చేయడాన్ని కార్మిక సంఘాలన్నీ వ్యతిరేకిస్తున్నాయి. కొత్తబ్లాక్‌లు సింగరేణికే అప్పగించాలి.

– రియాజ్ అహ్మద్, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల వేగం పెంచాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆర్‌అండ్‌బీ, టీజీఈడబ్ల్యూయూఐడీసీ పనులపై సమీక్ష నిర్వహించారు. డీఎంఎఫ్‌టీ ఇతర నిధులతో చేపట్టిన వంతెనలు, రోడ్లు, ఆసుపత్రి, పాఠశాల భవనాలు, ఇతర అభివృద్ధి పనులు ఆరాతీశారు. సమావేశంలో ఈఈ బావ్‌సింగ్ తదితరులున్నారు.

15లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకానికి ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ, మానిటరింగ్ కమిటీలో ఐదుగురు సభ్యుల నియామకం కొరకు ఎస్సీ, ఎస్టీకి చెందినవారు, ముగ్గురు నాన్‌అఫిషియల్ సభ్యులు స్వచ్ఛంద సంస్థలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తిగల వారు షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

పీఎం కుసుమ్ పథకం కింద సోలార్‌ప్లాంటు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కుసుమ్ కింద సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని నెలనెలా ఆదాయం పొందాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. రైతులు, సహకారసంఘాలు వారి భూముల్లో 500కిలోవాట్ల నుంచి 2మెగావాట్ల వరకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను అమ్మడం ద్వారా నెలవారీ ఆదాయం పొందొచ్చన్నారు. జిల్లాలో 4 సహకారసంఘాలు ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నాయని వివరించారు.

ఇంటి యజమానుల కోసం 'సూర్యఘర్'

సూర్యఘర్ ముఫ్తిబిజిలీ యోజన కింద ఇళ్ల పైకప్పుపై సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒకే కాలనీలో లబ్ధిదారులు ఏర్పాటుకు ముందుకొస్తే అదనంగా రూ.10వేల రాయితీని అందిస్తామన్నారు. ఈనెలాఖరు వరకు ఆసక్తిగల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. ఆర్డీవో గంగయ్య, డీసీవో శ్రీమాల తదితరులున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే విజయరమణారావు



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు(పెద్దపల్లి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం మండలంలోని ముప్పిరితోటలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి 22 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. సీఆర్ఆర్(ఎన్‌సీపీ) నిధులు రూ.10లక్షలతో ఎస్సీకాలనీలో సీసీరోడ్డు, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో సీసీ సైడ్‌డ్రైన్ పనులు ప్రారంభించారు. అలాగే పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవంలో మొక్కలు నాటారు. విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, నాబార్డు డీడీఎం జయప్రకాశ్, సహకార బ్యాంకు కరీంనగర్ సీఈవో సత్యనారాయణరావు, డీసీవో శ్రీమాల, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కర్‌రావు పాల్గొన్నారు.

మా బతుకులను రోడ్డు పాలు చేయద్దు



మంథని ఆర్డీవో సురేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మేడిపల్లి రైతులు

మంథని/రామగిరి: 'మా భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో మా బతుకులను రోడ్డుపాలు చేయొద్దు' అని మేడిపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మంథని ఆర్డీవో సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో అభివృద్ధి పేరుతో సింగరేణి సంస్థ సుమారు 400 ఎకరాలు, కృషివిజ్ఞాన కేంద్రం పేరుతో 170 ఎకరాలు సేకరించిందన్నారు. మంథని నియోజకవర్గం అబివృద్ధి చేయడానికి కేవలం రత్నాపూర్ మాత్రమే కనిపిస్తుందా..? మిగితా గ్రామాలు, మండలాలు కనిపించడం లేదా? అని వారు ప్రశ్నించారు. స్థానిక నాయకులు స్వార్థ ప్రయోజనల కోసం ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కొండు లక్ష్మణ్, కృష్ణమూర్తి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెతో కేంద్రం మెడలు వంచాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపు నిచ్చారు. సోమవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–11గనిలో ఏర్పాటు చేసిన కార్మిక సంఘాల జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. దేశంలోని కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా సవరించిందన్నారు. ఒక్కరోజు సమ్మెతో కేంద్రం దిగిరాకపోతే కార్మికులు నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ సంఘాల నాయకులు సదానందం, మెండె శ్రీనివాస్, వడ్డేపల్లి శంకర్, మడ్డి ఎల్లాగౌడ్, అరెల్లి పోశం, ఎంఏ గౌస్, నాయిని శంకర్, యాస శ్రీనివాస్, నరేష్, సంపత్, జాన్ కెనడి, సతీశ్, రాజమౌళి, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు పూర్తి మద్దతు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ప్రకటించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బుధవారం (ఈనెల 9న) జరిగే దేశవ్యాప్త ఒక్కరోజు టోకెన్ సమ్మె ఉంటుందన్నారు. కాంగ్రెస్ పాలనలో పంటపొలాలకు సాగునీరు అందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లను ఎత్తిపోసి పంటపొలాలకు సాగునీరు అందించాలన్నారు. లేదంటే నీటి కోసం మరో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి పంపింగ్ మొదలుపెట్టి సుందిళ్ల అన్నారం బ్యారేజీలో నీటిని నిల్వచేయాలన్నారు. సమావేశంలో నాయకులు గోపు అయిలయ్యయాదవ్, నడిపెల్లి మురళీధర్ రావు, బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి, నీరటి శ్రీనివాస్, పిల్లి రమేశ్, మెతుకు దేవరాజ్, నూతి తిరుపతి, జిట్టవేన ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి



బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డిని సన్మానిస్తున్న మిట్టపల్లి ప్రవీణ్ కుమార్

సుల్తానాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధ కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి కోరారు. సోమవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఆయనను గజమాలతో సన్మానించారు. మెజార్టీ సీట్లు గెలవడం కోసం సమష్టిగా పోరాడాలని సంజీవరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రూపు తగాదాలు లేకుండా ఐక్యంగా ముందుకు వెళ్తే విజయం తథ్యమన్నారు. అంతకు ముందు ఆయన పలు ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమాలలో పార్టీ జిల్లా కార్యదర్శి మహేందర్ యాదవ్, నాయకులు కామాని రాజేంద్రప్రసాద్, కందుల శ్రీనివాస్, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, కూకట్ల నాగరాజు, కొల్లూరి సతీశ్ కుమార్, అన్వేశ్, ఎల్లెంకి రాజన్న, గుడ్ల వెంకటేశ్, పవన్, సతీశ్, పల్లె తిరుపతి, సదయ్య, శేఖర్, కుమార్, సతీశ్ గౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన వ్యక్తి మృతి

కొడిమ్యాల: లారీ, బైక్ ఢీ కొన్న ఘటనలో గాయపడిన మండలంలోని సంద్రాలపల్లికి చెందిన బుచ్చిబాబు (28) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథన ప్రకారం.. బుచ్చిబాబు తనకు వరుసకు కొడుకైన మారుతితో కలిసి గంగాధర మండలం వైపు వెళ్తున్నారు. కొడిమ్యాల మండలం తుర్కాషినగర్ వద్దకు వెళ్లగానే కరీంనగర్ రహదారిపై లారీ వీరి బైక్‌ను ఢీకొంది. ఈఘటనలో బుచ్చిబాబు, మారుతి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేదు. చికిత్స పొందుతూ బుచ్చిబాబు మృతి చెందాడు. మారుతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కొడిమ్యాల పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు. అనారోగ్య కారణంగా గత వారం రోజుల నుంచి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రెండు రోజుల క్రితం మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే టూటౌన్ పోలీసులను ఆశ్రయించాలని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో కాంట్రాక్ట్ సూపర్‌వైజర్...


రాజశేఖర్(ఫైల్)

రామగుండం: రామగుండం పోలీస్ స్టేషన్ పరిధి విలేజ్ రామగుండం రోడ్డుపై రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై సంధ్యారాణి తెలిపిన వివరాలు.. విలేజ్ రామగుండంకు చెందిన అంబాల రాజశేఖర్(50) ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు యూనిట్–7లో షిఫ్ట్ ఆపరేషన్ విభాగంలో కాంట్రాక్ట్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బొలెరో ఢీకొని..


చిన్నయ్య (ఫైల్)

ధర్మారం: మండలకేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన మెడవేని చిన్నయ్య (70) మృతిచెందాడు. మండలకేంద్రానికి చెందిన చిన్నయ్య తన టీవీఎస్ వాహనంపై ధర్మారం నుంచి పెట్రోల్ బంకుకు వెళ్తున్నాడు. కరీంనగర్ వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన చిన్నయ్య అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పోలీసుల అదుపులో లొంగిపోయినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

చల్లూరు గ్రామంలో ఒకరు..

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన కొలిపాక రాజయ్య(60) సోమవారం ఉదయం వాకింగ్ చేస్తుండగా ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాలు.. గ్రామ శివారులో వాకింగ్ చేస్తుండగా మామిడాలపల్లి నుంచి రాజిరెడ్డి అనే వ్యక్తి ఆటో నడుపుకుంటూ వస్తూ రాజయ్యను వెనక నుంచి ఢీ కొట్టాడు. తీవ్రగాయాలైన రాజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.


శీత్లా భవాని తల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న గిరిజనులు (ఫైల్)


సంప్రదాయ పద్ధతిలో అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న యువతులు (ఫైల్)

అడవంతా పండుగ..

- నేడు శీత్లా భవాని వేడుకలకు తండాలు ముస్తాబు
- నైవేద్యాలతో అటవీ ప్రాంతాలకు తరలనున్న గిరిజనులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: గిరిజనుల ఆరాధ్య దైవం శీత్లాభవాని అమ్మవారి వేడుకలకు తండాలు ముస్తాబయ్యాయి. అడవి బిడ్డల ప్రత్యేక పండుగగా శీత్లా భవానిని వేడుకుంటారు. వర్షాకాలం ఆరంభమై పెద్దపూసల కార్తీలో గిరిజన తండాలో శీత్లా పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. జూలై తొలి, రెండో మంగళవారాల్లో సంప్రదాయ బద్ధంగా పండుగ జరుపుకుంటారు. తండాల పొలిమేర్ల వద్ద శీత్లా భవానిని ప్రతిష్ఠించి యువతులు బోనాలు ఎత్తుకుని అక్కడికి చేరుకుంటారు. కోళ్లు, మేకలు, గొర్రెలను బలిచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. పశువులన్నింటినీ ఒక చోట చేర్చి బలి ఇచ్చిన మేక పేగు మీదుగా వాటిని దాటిస్తారు. బావి నుంచి తెచ్చిన నీటిని వాటిపై చల్లుతారు. ఆ కారణంగానే దీనికి దాటుడు పండుగగా పేరొచ్చింది. గిరిజన యువతుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కాగా రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 126 తండాల్లో ఒకే రోజు మంగళవారం పండుగ నిర్వహించాలని జిల్లా బంజారా సేవా సంఘం ప్రతినిధులు నిర్ణయించారు.

నైవేద్యాలతో అటవీ ప్రాంతాలకు..

శీత్లా భవాని వేడుకలను పురస్కరించుకుని ఉదయమే గిరిజనులు నైవేద్యాలతో ఊరేగింపుగా అటవీ ప్రాంతానికి తరలివెళ్తారు. అక్కడ తమ దేవతలైన శీత్లా భవాని, తుల్జా భవాని, మసూరి భవాని, అంబ భవాని, దుర్గా భవాని, మాతలకు మొక్కులు చెల్లించుకుంటారు. పిల్లపాపలు, పశుసంపద బాగుండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు బాగా కురువాలని పూజలు చేస్తారు. అనంతరం గిరిజన మహిళల నృత్యాలు ఉంటాయి. శీత్లా భవాని తల్లిని ప్రధాన దేవతగా కొలుస్తారు. పెళ్లికాని యువతులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మంచి వరుడు దొరకాలని వేడుకుంటారు. మూడురోజుల పాటు జరుపుకునే ఈ పండుగ కోసం సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా స్థిరపడినవారు స్వగ్రామాలకు చేరుకుంటారు.

కోరికలు నెరవేరుతాయి



శీత్లాభవాని అమ్మవారిని కొలిస్తే కోరికలు నెరవేరుతాయి. పశుసంపద, పంటలు, ఆయురారోగ్యాలతో ఉండాలని పండగ రోజు అమ్మవారిని కొలుస్తాం. పిండి నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకుంటాం. ఏటా ఇదే మాసంలో పండుగ జరుపుకోవడం ఆనవాయితీ.
– అజ్మీరా రజిత, మాజీ సర్పంచ్, బుగ్గారాజేశ్వర తండా

ఒకే రోజు జరుపుకోవాలని..



జిల్లాలోని అన్ని మండలాల్లో గల తండాల్లో ఒకే రోజు శీత్లా భవాని వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించాం. గతంలో రెండు వారాల పాటు పండుగను జరుపుకునేవారు. ఈసారి ఈనెల 8న అన్ని తండాల్లో అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవాలని సూచించాం.
– గుగులోతు సురేశ్‌నాయక్, బంజారాసేవా సంఘం జిల్లా అధ్యక్షులు

సెలవు ప్రకటించాలి



ఏటా జూలై రెండో మంగళవారం శీత్లా పండుగ జరుపుకుంటాం. అమ్మవారలకు సంప్రదాయ వేశధారణలో మొక్కులు చెల్లించుకుంటాం. శీత్లాభవాని వేడుకలకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని కోరుతున్నాం.
– గుగులోత్ కళావతి, మాజీ జెడ్పీటీసీ, వీర్నపల్లి

రాష్ట్ర పండుగగా గుర్తించాలి



శీత్లాభవాని పండుగను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి బడ్జెట్ కేటాయించాలి. గోర్ బంజారాల పండుగలను గుర్తించకపోవడం చాలా బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించాలి.
– గూగులోత్ రవిలాల్‌నాయక్, మద్దిమల్ల

ఆ రోజు బాధేసింది.. ఈరోజు ఆనందంగా ఉంది


పాఠశాల విద్యార్థులతో మంత్రులు శ్రీహరి, ప్రభాకర్, తదితరులు

- కరీంనగర్ క్రీడా పాఠశాలపై మంత్రి వాకిటి శ్రీహరి

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రంలో ఇన్నాళ్లు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రతిష్టాత్మకంగా భావించానని, చాలామంది తమను హకీంపేటకు మార్చాలని దరఖాస్తులు వచ్చాయని కానీ 200 ఎకరాల్లో ఉన్న హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ కంటే కరీంనగర్‌లోని స్పోర్ట్స్ స్కూల్ చాలా బాగుందని సంబురపడ్డారు క్రీడా మంత్రి వాకటి శ్రీహరి. సోమవారం కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డిలతో కలిసి పర్యటించారు. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు శాట్స్ ఎండీ, చైర్మన్‌లతో కలిసి ఒక రోజు ఉదయాన్నే వెళ్లానని కానీ నేను అనుకున్నట్లుగా అక్కడ వసతులు లేవని తినకుండానే తిరిగొచ్చామన్నారు. కరీంనగర్‌కు వచ్చే ముందు హకీంపేటలోనే ఏమీ లేవు ఇక కరీంనగర్ ఎలా ఉంటుందో అనుకొని వచ్చానని కానీ ఇక్కడి వసతులు, వాతావరణం, సౌకర్యాలు చూసి మనసు ఉల్లాసమైందన్నారు. నాకు ఆరోజు బాధేసిందని..కానీ ఈ రోజు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగ ఆయాన కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌ను చూసి మురిసిపోయారు. ప్రపంచం గర్వపడేలా క్రీడల్లో రాణించాలని చిన్నారులకు సూచించారు.

క్రీడా వసతులపై శాట్స్ ఎండీ ఆరా

కరీంనగర్‌లో క్రీడా శాఖ మంత్రి పర్యటన సందర్భగా రాష్ట్ర క్రీడా శాఖ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి కూడా వచ్చారు. మంత్రి ఇతర కార్యక్రమాలకు వెళ్లగా ఆమె ప్రాంతీయ క్రీడా పాఠశాలను పరిశీలించి క్రీడా వసతులపై ఆరా తీశారు. కాసేపు శాట్స్, క్రీడా శాఖ, ఒలింపిక్, క్రీడాపాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. క్రీడా పాఠశాలలో రెజ్లింగ్, జూడో, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో శాట్ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, డీవైఎస్‌వో శ్రీనివాస్ గౌడ్, డీఈవో శ్రీరామ్ మొండయ్య, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణాలు పాటించకనే కాళేశ్వరం కుంగుబాటు

- ఎమ్మెల్సీ కోదండరాం


మాట్లాడుతున్న కోదండరాం

శంకరపట్నం(మానకొండూర్): కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో సాంకేతిక ప్రమాణాలు పాటించకపోవడంతోనే కుంగిపోయిందని, బాధ్యులపై ప్రభుత్వం కేసు నమోదు చేయాలని తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. సోమవారం ప్లీనరీ సమావేశంలో మాట్లాడారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మిస్తే కాంట్రాక్టర్లు, బీఆర్ఎస్ నేతలు లబ్ధి పొందారని ఆరోపించారు. అవినీతి పాల్పడిన నాయకులు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరంకుశపాలనను అంతం చేయడానికి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మించి అంబేడ్కర్ సుజల స్రవంతి అని నామకరణం చేయాలన్నారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కోదండరాంకు జిల్లా కన్వీనర్ మోరె గణేశ్ నాగలిని బహూకరించారు. రాష్ట్ర ప్రధన కార్యదర్శులు ముక్కెర రాజు, అరికెల్ల స్రవంతి, ధర్మార్జున్, మండల అధ్యక్షుడు రమేశ్, శ్రీనివాస్, సతీశ్, భానుకిరణ్, సాయిరాం, అరుణ్, రాజేశ్ పాల్గొన్నారు.

రాజన్నకు మొక్కులు



వేములవాడ: రాజన్నను సోమవారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ముసురును సైతం లెక్క చేయకుండా కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో రాధాబాయి, ఏఈవోలు శ్రీనివాస్, శ్రవణ్, అశోక్, జయకుమారి, పర్యవేక్షకులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.

25 రోజుల్లో రూ.2 కోట్ల ఆదాయం

రాజన్నకు 25 రోజుల్లో హుండీల ద్వారా రూ.2 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఈవో రాధాబాయి తెలిపారు. కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య సోమవారం హుండీలలోని కట్నాలు, కానులను ఆలయ అధికారులు, శ్రీరాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు లెక్కించారు. రూ.1,99,84,960 నగదు, మిశ్రమ బంగారం 188 గ్రాములు, మిశ్రమ వెండి 14.300 కిలోలు సమకూరినట్లు ఈవో తెలిపారు. ఆలయ ఎస్పీఎఫ్ ఏఎస్సై మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

తాళ్లధర్మారంలో చోరీ

- రూ.52 వేల నగదు, 17 తులాల వెండి అపహరణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామంలో ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. రూ.52వేలు, 17 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. ఎస్సై రాజు కథనం ప్రకారం తాళ్లధర్మారానికి చెందిన బండ్ర జ్యోతి మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో ఉంటున్న తన కుమారుడి వద్ద ఉంటోంది. ఇంటికి తాళం వేసిన ఉన్న విషయాన్ని గమనించిన దొంగలు తాళం పగలగొట్టి బీరువాలో దాచిన రూ.52 వేలు, 17 తులాల పట్టగొలుసులు అపహరించుకెళ్లారు. బాధితురాలు ఇంటికొచ్చి చూడగా విషయం బయటపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని కూనారం గ్రామంలో సోమవా రం ఒంటరిగా ఉన్న దేవర్ల రాజమ్మ అనే వృద్ధురాలి మెడ నుంచి చైన్‌స్నాచర్లు పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. పుస్తెలతాడు విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఏఎస్సై నీలిమ వివరాలు సేకరించారు. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

మేకను గావుపట్టిన వ్యక్తిపై కేసు

మల్యాల: మొహర్రం సందర్భంగా మేకను గావు (బలి) పట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ప్రివెన్షన్ ఆఫ్ యానిమల్ క్రుయాల్టీ యాక్ట్ కింద ఎన్‌జీఓ స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సభ్యుల ఫిర్యాదు మేరకు గావుపట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

మల్యాల: మండలంలోని నూకపల్లి సిరిగిరి స్వీటీ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. స్వీటీ తన ఇంట్లో దొంగతనం జరిగిందనే ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టి అనుమానితులను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా దొంగతనం చేసినట్లు తేలింది. దొంగతనానికి పాల్పడిన నూనె సారిక, మహ్మద్ వాజిద్, బోదాసు రాజు, మెడబోయిన అజయ్‌ను అరెస్టు చేసి వారి నుంచి టీవీ స్వాధీనం చేసుకున్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై అఘాయిత్యం?

వీర్నపల్లి(సిరిసిల్ల): అంగన్‌వాడీ టీచర్‌ను ఓ వ్యక్తి అఘాయిత్యానికి ప్రయత్నించిన ఘటన మండలంలో జరిగింది. వివరాలు.. మండలానికి చెందిన ఓ అంగన్‌వాడీ టీచర్ విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఓ వ్యక్తి ఇంటి వద్ద దింపుతానని బైక్‌పై ఎక్కించుకున్నాడు. ఇంటికి కాకుండా ఫారెస్ట్ వైపు తీసుకెళ్తుండగా టీచర్ కేకలు వేస్తూ బైక్ పై నుంచి దూకింది. తలకు గాయాలవడంతో స్పృహ కోల్పోయింది. దీంతో సదరు వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలిని స్థానికులు 108లో ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. జరిగిన ఘటన అనుమానాస్పదంగా ఉందని, దర్యాప్తు చేస్తామని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన కోట సుశీల (75) సోమవారం ఎల్లమ్మచెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాలు.. కొంతకాలంగా సుశీల అనారోగ్యంతో బాధపడుతోంది. కరీంనగర్, వరంగల్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. వీటికి తోడు గతేడాది చిన్న కుమారుడు కోట సమ్మయ్య అనారోగ్యంతో మరణించడంతో కుంగిపోయి, జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంది. భర్త ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఊరూరా మొహర్రం


గుండారంలో పీరీలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


పీరీలను ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యే చందర్

పెద్దపల్లి జిల్లాలో మొహర్రం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన పీర్ల ఊరేగింపులో మంథని, రామగుండంలో మాజీ ఎమ్మెల్యేలు పుట్టమధూకర్, కోరుకంటి చందర్ పాల్గొన్నారు. మొహర్రం కులమతాలకు అతీతంగా చేసుకునే వేడుక అని వారు అన్నారు. బీఆర్ఎస్ నాయకులు గోపు అయిలయ్య యాదవ్, నారాయణదాసు మారుతి, అర్షనపల్లి శ్రీనివాస్, నిమ్మరాజుల సాగర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, సలావుద్దీన్, సోహెబ్ హుస్సేన్, ఇరికిల్ల సంపత్, మంథని మాజీ ఉపసర్పంచ్ పుప్పాల బాగ్యలక్ష్మితిరుపతి, బీఆర్ఎస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు బుద్దార్థి రాణి తదితరులు పాల్గొన్నారు.
– మంథని/రామగుండం/సుల్తానాబాద్/కమాన్‌పూర్/ఎలిగేడు/ఓదెల/యైటింక్లయిన్‌కాలనీ/జూలపల్లి


పీర్లకు మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే


సుల్తానాబాద్‌లో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు


కాల్వశ్రీరాంపూర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు రాజేందర్

పెద్దపల్లి జిల్లాలోని అన్ని మండలాల్లో ఎమ్మార్పీఎస్, ఆవిర్భావ వేడుకలు, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.
– సాక్షి నెట్‌వర్క్


సుల్తానాబాద్‌లో స్వీట్ తినిపిస్తున్న జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు

తండ్రి సాయంతో కొడుకు చోరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు

మంథని: మంథని మండలం బిట్టుపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన చోరీ కేసులో తండ్రీకొడుకులను అరెస్ట్ చేసినట్లు సీఐ రాజు తెలిపారు. సోమవారం మంథని పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. గత 18న బిట్టుపల్లికి చెందిన కందుకూరి లక్ష్మి అనే మహిళ ఒంటరిగా ఉండటాన్ని గమనించిన ధర్మారం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు రాయినేని అనిల్, రాయినేని మల్లయ్య.. లక్ష్మి ఇంట్లో చొరబడి రెండు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఘటనా స్థలంలో అంబర్ ప్యాకెట్‌ను గుర్తించారు. ఈ క్రమంలో మలయ్య, అనిల్‌పై అనుమానంతో విచారించగా నేరం చేసినట్లు అంగీకరించారు. అలాగే మంథని మండలం పుట్టపాకలో ట్రాక్టర్, సుందిళ్ల పంపుహౌస్‌లో ఇనుపరాడ్స్, మంథని పెట్రోల్‌బంకు వద్ద బైక్, వాసవీనగర్‌లోని ఓ ఇంట్లో దొంగతనం, ముత్తారం మండలంలో వడ్ల చోరీ, రామగిరి మండలంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసులను ఛేదించి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో పల్లెల్లో స్పెషల్‌డ్రైవ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మంథని, రామగిరి, ముత్తారం ఎస్సైలు పాల్గొన్నారు.

పదిగంటల జీవో సంగతి తేల్చాలి


సమావేశంలో జేఏసీ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ పది గంటల జీవో విడుదల సంగతిని తెలియజేయాలని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద మాట్లాడారు. కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించకుండా పది గంటల జీవో ఇవ్వడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10 గంటల పని విధానంపై జారీ చేసిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జీవో కాపీలను దహ నం చేశారు. నాయకులు రెడపాక లక్ష్మణ్, పుల్లూరి నాగభూషణం, రాజమల్లయ్య, చింతల సత్యం, దగ్గుల సత్యం, కడారి సునీల్, సీహెచ్.ఉపేందర్, తోకల రమేశ్, కె.విశ్వనాథ్, ముద్దసాని దామోదర్‌రెడ్డి, జయసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం



ధర్నా చేస్తున్న నాయకులు

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు పర్మిషన్‌లు ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారని, ప్రైవేట్ స్కూళ్లలో విచ్చలవిడిగా ఫీజులు పెంచుతున్నా వి ద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నా రు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షులు అంగిడి దేవేందర్, జీవన్, తాత్విక్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ఇంత నిర్లక్ష్యమా..

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తోందని, ఉన్నత చదువులు చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ల సందీప్, ప్రశాంత్ ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఉన్నత విద్య చదివిన విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను చెల్లించకపోవడంతో విద్యార్థులు కాలేజీ యాజమాన్యాల తీరుతో మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. నాయకులు అరవింద్, నరేశ్, అఖిల్, అభిలాష్, ఓంకార్, వినయ్, అభివర్షన్, కావ్య, హాలియ తదతరులున్నారు.

జీవో నం.282ను రద్దు చేయాలి

పెద్దపల్లిరూరల్: కార్మికుల శ్రమను దోచుకునేందుకు వీలుగా ప్రస్తుతమున్న 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచుతూ జారీ చేసిన 282 జీవోను రద్దు చేయాలని కార్మిక జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ శ్రీహర్షను కలిసి వినతిపత్రం అందించారు. ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. చందర్, నరేశ్, సీపెల్లి రవీందర్, రాజేశం, ప్రసాద్, చింతల శేఖర్ తదితరులున్నారు.